తల్లిని
బలితీసుకున్న
బావిని
ఆ కుటుంబం
ఏం చేసింది?

# బావి

అచ్యుతుని
రాజ్యశ్రీ
కథ

ఉగాది దగ్గర పడ్తోంది. చేదు విషాద జ్ఞాపకాలు తరువముకొస్తుంటే తెల్లారిపోతున్నదని లేచి కూచున్నారు సుబ్బారావుగారు మంచంపై. కిటికీలోంచి పెరటివైపు చూశారాయన. దూరంగా గిలకలబావి. తన గుండెలో బాకు నింపిన బావి! సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజుల్లో తన అర్ధాంగి వరలక్ష్మిని పొట్టన పెట్టుకున్న బావి! కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి ఆయనకు. తలలో ఆలోచన్ల సుడిగుండం, హృదయంలో గాలిదుమారం!

ఆ పల్లెటూర్లో ఎలిమెంట్రీ స్కూలు టీచరుగా చేసి రిటైరైన సుబ్బారావుగారు ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి, మూడవవాడైన మూర్తిని బి.ఎ., బి.ఇడి చదివించేటప్పటికి ఉన్న మూడెకరాలు పోను మిగిలింది మూడు గదులు వసారా వున్న ఆ పెంకుటిల్లు. అందులోనే పురుళ్లు, పుణ్యాలు, రోగాలు, రొచ్చులూ, నవ్వులూ కన్నీళ్లూ ఎప్పుడో సుబ్బారావు తాత కోటయ్యగారు కట్టించిన పాత ఇల్లు అది. అక్కడే సుబ్బారావు పుట్టాడు. వడుగు, పెళ్లి, భర్తగా తండ్రిగా ఎన్నో అనుభవాలు. ఎన్ని అమర్చుకున్నా ఆ ఇంటికి నీటి సౌకర్యం మాత్రం లేదు. తల్లి మడికట్టుకుని మంచినీరు తెస్తే, తను భార్య వరలక్ష్మి ఉప్పునీరు మోసుకొచ్చేవారు. వరలక్ష్మి బాలింత చూలింతగా వున్నప్పుడు పనిమనిషి శాయమ్మ తెచ్చేది. తల్లి పోయిన తర్వాత రోజూ అనేది శాయమ్మ ''మడీ తడీ ఏందమ్మా? పెద్దామె పోనే పోయే... మీ పానంకన్నా ఎక్కువా?'' అని ఆప్యాయంగా మందలిస్తుంటే సుబ్బారావు దంపతుల కళ్లు చెమర్చేవి. ''పెద్దమ్మగోరు ఎట్టాగూ లేరు. ఆ ముగ్గురు పిల్లల్తో ఏం చేత్తారమ్మా? ఏదో నా బుడ్డోడికి అయ్యగారు ఇంత అచ్చరం ముక్క నేర్పుతుండారు. నే తెస్తా'' అని ఉప్పునీరు ఆమె తెస్తుంటే పక్కింటి బోరింగు పంపు దగ్గర మంచినీరు ఓ రెండు బిందెలు



తెచ్చేది వరలక్ష్మి.

ఓరోజు దీపారాధనకి వత్తులు చేసుకుంటూ పడకకుర్చీలో వాలి పరీక్ష పేపర్లు దిద్దుతున్న భర్తతో అన్నదామె-

''ఏమండీ! మనవాడికి ఈ ఊళ్లోనే ఉద్యోగం రావడం మన అదృష్టం. రేపో మాపో పెళ్లి చేయాలి. అన్నీ బానేవున్నా మనింటి మంచి నీళ్ల సమస్య తీరలేదు. అత్తగారి తరం, నా కాలం వెళ్లిపోయాయి.

శాయమ్మకూడా పెద్దల్లో కలిసింది. దాని కోడలు ఈ రోజు ఖచ్చితంగా చెప్పేసింది. ''అమ్మా ఇక బిందెలు బిందెలు నీళ్ళు మోయడం నావల్లకాదు. వంద రూపాయలివ్వండి లేదా వేరే వాళ్ళని పెట్టుకోండి. మాసీ మీలాంటి ప్రాణాలే కావాలంటే పక్కింట్లో బోరింగ్ నీళ్ళు తెస్తా'' అంది. ఆ ప్రక్కింటి పార్వతమ్మగారువాళ్ళు ఇన్నాళ్ళూ తల్లీ తోడుగా వుండేవారు. వాళ్ళూ ఇల్లు అమ్మేసుకున్నారా? అప్పుడే పార్వతమ్మగారు హెచ్చరించింది. ''ఏమండోయ్ వరలక్ష్మిగారూ! మావాడు హైదరాబాద్‌లో ఇల్లు కట్టాడు. మేము దీన్ని అమ్మేసి వెళ్ళిపోతున్నాం. ఇక మీరే ఇంట్లో నీళ్ళ ఏర్పాట్లు చేసుకోండి. ఆ కొనుక్కున్నవారు రోజా తీసుకెళ్ళడానికి ఒప్పుకోవద్దూ?'' అంది. ఆ మాటా నిజమే. మనంకూడా బోరింగో, బావినో త్రవ్వించుకుంటే మంచిది''

నిజమే వరం! బోరింగ్ అంటే చాలా డబ్బు అవుతుంది. బావే త్రవ్విద్దాం. సిద్ధాంతిగారిచేత ముహూర్తం, స్థలం ఎంపిక చేయిస్తా'' అని అప్పటికప్పుడే బైలుదేరాడాయన. ఆమె మనసు చెప్పలేని ఆనందంతో నిండిపోయింది. ''అబ్బ ఎన్నాళ్ళకి ఈ నీటి కరువు తీరబోతోంది? కొడుకు పెళ్ళికూడా అయిపోయింది. బి.ఇడి పరీక్షలు వ్రాసి వస్తుంది కోడలు కాపురానికి. ఇక మంచినీటి కోసం వీరింటికి వారింటికి దేబిరించుకుంటూ వెళ్ళనక్కర్లేదు. తనూ భర్త ఎంచక్కా పెరట్లో వాకిట్లో మొక్కలు పాతేసి కూరలు, పూలు కాయించవచ్చు. కోడలికి కూడా ఉద్యోగం వస్తే నెమ్మదిగా ఈ పెంకుటిల్లుని డాబాగా మార్చాలి. పెరట్లో అరటి, కొబ్బరి, చిన్న తులసికోట, పూలచెట్లు, పుట్టబోయే బుల్లి మనవడు, మనవరాల్ని తల్చుకుంటూ మురిసిపోతోంది. పాపం! ఆ కనకమ్మగారు ఇప్పటికీ ఇంట్లోనండీ అని చిక్కుడు, పొట్లకాయలు, గిన్నెడేసి మల్లెలు, కనకాంబరాలు పంపుతుంది. తనూ అలా పంపాలి''

అనుకున్న ముహూర్తానికి బావి త్రవ్వకం సాగింది. మీ అత్తా కోడళ్ళు చేయాల్సింది గౌరీ, వరలక్ష్మి వ్రతాలు కాదు. గంగాభవానీ సేవలు'' అని హాస్యం చేసేవాడు మూర్తి. బావిలో ఊరిన నీరు చూస్తూనే సంబరంతో చిన్నపిల్లలా కేరింతలు కొట్టింది వరలక్ష్మమ్మ. ''అబ్బ కొబ్బరి బొండంలా ఎంత తీయగా ఉన్నాయండీ! అని దోసెడు నీరు నోట్లో వంపుకుంటున్న భార్యవైపు మురిపెంగా చూశాడాయన. ''పాపం ఎంత పిచ్చిది వరం! ఇన్నాళ్ళూ భుజాలు పడిపోయేలా బిందెలు బిందెలు మోసింది. తనూ ఎంత మూర్ఖుడు! ఎంతసేపూ స్కూలు పాఠాలు, పరీక్షలు, పెళ్ళిళ్ళు ఇవే పట్టించుకున్నాడుకానీ తెల్లారి లేస్తూనే నీటి చుక్క లేందే బ్రతుకు గడవదన్న విషయం తనకెందుకు తట్టలేదు? పోనీలే ఇన్నాళ్ళకి ఆమె కోరిక, కష్టాలు తీరాయి'' ''ఏమండోయ్ పిన్నిగారూ! బావి త్రవ్వించారుగానీ ఇంకా గట్టు, గిలక పెట్టించలేదేం? చేదవేసి తోడడం తేలికగదా? అనే ఇరుగు పొరుగుల్తో ఏదీ వర్షం తుఫాన్‌కదా? ఇప్పటికే ఐదారువేలైంది. కొంచెం డబ్బు కూడగట్టుకోవాలి. తుఫాన్ తగ్గగానే గట్టు కట్టిస్తాం. అందాకా ఇలా తోడుకోవడమే'' అని సంబరంగా అందరితో చెప్పి అప్పుడే ఎవరింటినుంచో కనకాంబరాలు, బంతిమొక్కలు తెచ్చి పాతింది.

ఆ రోజింకా చీకట్లు విడలేదు. ''ఏమండీ! మన టామీ దొడ్లోకి జారుకుందే! అసలే వర్షం. దొడ్డి అంతా రొచ్చుగా వుంది. బావిలో జారి పడ్తుందేమో? నిన్నటినుంచీ దానిచుట్టూ గంతులేస్తోంది'' అని భర్తతో అంటూ దొడ్లోకి వెళ్ళిందామె. ''టామీ'' అంటూ మూడు నెలల తెల్లని బుల్లికుక్కపిల్ల బావిదగ్గర గంతులేస్తుంటే గభాలున పరుగెత్తింది. దాన్ని పట్టుకుందామని.

అంతే, అసలేరొచ్చుతో వున్న ఆ బురద నేలలో కాలుజారి దబ్బున బావిలో పడిపోయింది వరలక్ష్మమ్మ. ఆ చప్పుడికి ఇంట్లోవారంతా బయటకు పరుగెత్తుకు వచ్చారు. లోతైన బావిలో నీళ్ల కదలిక. కుయ్‌కుయ్‌మంటూ దూరంగా నిల్చుని మూల్గుతున్న టామీ. ఇరుగు పొరుగుని కేకేసి ఇంకా నిద్రమత్తులో వున్నవాళ్లంతా తేరుకుని తాడు అవి తెచ్చేలోపల శాశ్వతంగా వరలక్ష్మమ్మ ఈ లోకాన్నే వదిలిపోయింది.

''అమ్మా! బావి తవ్వించండి నీరుకావాలి. కోడలన్నా సుఖపడ్తుంది అని తపించిపోయి చివరికి దానికే బలి అయ్యావా?'' అని భోరున ఏడ్వసాగాడు మూర్తి. ''ఆఖరి కోరిక తీరుతూనే కన్నుమూశావా వరం'' అని కుమిలిపోయారు సుబ్బారావుగారు.

వరలక్ష్మి పోయి అప్పటికి పదిహేను రోజులు దాటింది. ''నాన్నా! ఆ పాడు బావిని పూడ్పించేద్దాం నాన్నా! అమ్మను మింగిన రాకాసి బావి'' అన్నాడు కసిగా మూర్తి. వేదాంత ధోరణిలో పిచ్చిగా నవ్వారాయన.

''చూడుబాబూ! మన పిచ్చికానీ బావిని పూడిస్తే అమ్మ తిరిగి వస్తుందా? బావి తవ్వించమని నీవు పుట్టకముందునుంచి పోరేది. కానీ అప్పట్లో నాకంతగా నీటి సమస్య తెలీలేదు. మీ బామ్మ మడీ తడీ చాదస్తపు మాటల ఆర్థిక వత్తిడులవల్ల నుయ్యి తవ్వించలేకపోయాను. కనీసం నీ పెళ్లి అయిన తర్వాతైనా కోడలన్నా సుఖపడ్తుందని పోరి పోరి తన కోరిక తీర్చుకుంది. రోజూ ఎంతమంది మనింటికి వచ్చి నీరు మోసుకెళ్తున్నారో చూశావుగా నాయనా? ''వరలక్ష్మిగారింట్లో నీరు. అబ్బ... కొబ్బరిలా తీపిగా వున్నాయి. చల్లని తల్లి. మన ప్రాణాలు నిల్పుతోంది'' అని ఆమెని పొగుడ్తుంటేగర్వపడి తృప్తిగా నిట్టూర్చేది మీ అమ్మ. అలా అందరికీ ఉపయోగపడే ఆ బావిని పూడ్పిస్తే ఏం వస్తుంది? రోజూ కాశీలో గంగానదిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుంటారు. శవాలు తేలుతుంటాయి. అంత మాత్రాన ఆ నది అపవిత్రమైపోయిందా. అది నరహంతకిలా అందరూ భావిస్తున్నారా? నీటి బుడగలాంటిది మనిషి జీవితం. అయినా ఆ నీరే జీవనాధారం. అందుకోసమే తపించింది మీ అమ్మ. కుల మత తేడా లేకుండా దప్పిగొన్న ఆ గూడెం జనానికి తన చల్లని కమ్మని నీరు ఇస్తున్న ఆ బావిని పూడిస్తే మీ అమ్మ ఆత్మశాంతిస్తుందా? చెప్పునాయనా?'' అని ప్రశ్నిస్తున్న తండ్రి మాటలకు సిగ్గుతో తలవాల్చాడు మూర్తి.

